# నయవంచనకు మారుపేరు కాంగ్రెస్

- నమ్మకానికి నిదర్శనం సీఎం కేసీఆర్
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాల వ్యూహాలు ఖతం
- మూడోసారి పార్టీ అధికారంలోకి రావడం ఖాయం
- ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్
- కాజీపేటలో రోడ్డు షో, ప్రచారం
- 500 మంది బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల చేరిక

కాజీపేట, అక్టోబర్ 19 : నయవంచనకు మారుపేరు కాంగ్రెస్ అని ప్రభుత్వ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కాజీపేటలోని మెయిన్ రోడ్డులో గురువారం ప్రచారం, రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ ప్రతి దుకాణానికి వెళ్లి అందరినీ పలుకరించారు. కలిసిన ప్రతి ఒక్కరిని ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్తక, వాణిజ్య సంఘాలు మూకుమ్మడిగా బీఆర్ఎస్ పార్టీకి మద్దతు నిస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబ పెద్దలా ఆలోచించి, ఆచితూచి మ్యానిఫెస్టోని తయారు చేశారన్నారు. నమ్మకానికి మారుపేరు కేసీఆర్ అని, నయ వంచనకుమారు పేరుగా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందన్నారు. సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోతో ప్రజల హృదయాలు ఆనందంతో పొంగిపోతుంటే ప్రతి పక్షాల గుండెలు జారిపోయి, వారి వ్యూహాలు ఖతమయ్యాయని అన్నారు. కేసీఆర్ బీమా ప్రతి ఇంటికి ధీమా, సౌభాగ్యలక్ష్మి వంటి పథకాలను మహిళల కోసం తీసుకొచ్చారన్నారు. గ్యాస్ సిలిండర్‌తో బీజేపీ సెగ పెట్టిందని, అయితే, సీఎం కేసీఆర్ మాత్రం సిలిండర్‌ను రూ.400కే పేదలకు అందించే నిర్ణయం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆసరా పింఛన్లను రూ.5 వేలకు పెంచడం, దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచడం, రైతు బంధును రూ.16,000లకు పెంచుతూ మ్యానిఫెస్టోలో పెట్టారన్నారు. టికెట్లు ఇచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ నాయకుల నిజరూపం బయట పడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను రూ.10 కోట్లకు అమ్ముకున్నారని ఆ పార్టీ నాయకులే ఢిల్లీ, గల్లీల్లో నిరసనలు తెలుపుతున్నారన్నారు. పీసీసీ అధ్యక్షుడు ఆనాడు ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికితే, ప్రస్తుతం నోట్లకు సీట్లు అంటూ అమ్ముకుంటున్నాడని కాంగ్రెస్ నాయకులే బహిరంగంగా చెబుతున్నారన్నారు. ప్రధాని పార్లమెంట్ సాక్షిగా తల్లిని చంపి బిడ్డను బతికించారని తెలంగాణపై అక్కసు వెళ్లగక్కారన్నారు. తెలంగాణకు హక్కుగా రావాల్సిన నిధులను నిలిపివేసి, అభివృద్ధిని అడ్డుకున్నారన్నారు. ప్రధాని ఢిల్లీలో తెలంగాణను మెచ్చుకుని, రాజకీయం కోసం గల్లీల్లో తిట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. రాష్ట్ర ఆదాయన్ని పెంచడం దాన్ని ప్రజలకు పంచడం సీఎం కేసీఆర్ అభిమతమన్నారు. కాంగ్రెస్ నాయకులు ఒక్కసారి అధికారం ఇవ్వాలని అడుగుతున్నారని, గతంలో 11 సార్లు ప్రజలు అవకాశం ఇచ్చినా ఏం చేశారని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో ఎంతో అభివృద్ధి చేసి, ప్రజల మనసులు గెలుచుకున్నారన్నారు. ప్రజల ఆశీస్సులతో మూడోసారి బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రం లో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్, పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ జనార్దన్ గౌడ్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాజీపేటలో ప్రచారంలో పాల్గొన్న చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎంపీ పసునూరి దయాకర్ తదితరులు

## బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు



పార్టీలో చేరిన యువతతో చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ : వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి పలువురు నాయకులు భారీగా బీఆర్ఎస్‌లో చేరారు. బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సుమారు 500 మంది యువకులకు చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో భారీగా చేరుతున్నారన్నారు. కేసీఆర్ సబ్బండ వర్గాలకు సాను కూలంగా సంక్షేమ పథకాలను తీసుకొచ్చారన్నారు. ఇన్నాళ్లు బీజేపీ, కాంగ్రెస్ నాయకత్వాల మాయమాటలు నమ్మి మోసపోయిన యువత, నేడు నీచపు రాజకీయం నుంచి విముక్తి పొందుతున్నారన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వారికి ఏ కష్టం వచ్చినా ముందుండి అండగా నిలుస్తుందన్నారు. పాత, కొత్త అనే తేడా లేకుండా కలిసికట్టుగా పనిచేసి, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. పార్టీ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమైందన్నారు. పార్టీలో చేరిన 500 మంది యువకులు రానున్న ఎన్నికల్లో 50వేల ఓట్లు వేయించేందుకు కృషి చేయాలని చీఫ్ విప్ కోరారు. కాంగ్రెస్, బీజేపీ చేసిన అరాచకాలు, నీచపు రాజకీయాలను ప్రజలకు తెలిసేలా చేయాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ, ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారిని బీఆర్ఎస్ గుర్తుంచుకుంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పశ్చిమ కన్వీనర్, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి.. ఓ 420

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- కాటారం సభలో రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మండిపడిన మంత్రి

హనుమకొండ, అక్టోబర్ 19 : టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఓ 420 అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫైర్ అయ్యారు. కాటారం సభలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి విరుచుకుపడ్డారు. 'రేవంత్‌రెడ్డి.. నన్ను దద్దమ్మా అంటావా..' అని మండిపడ్డారు. 'నీ లాగా బ్రోకర్ మాటలు నాకు రావు కాబట్టి నేను దద్దమ్మనే... అందుకే నన్ను ప్రజలు 7 సార్లు గెలిపిస్తున్నారు..' మంత్రి పేర్కొన్నారు. 'నువ్వు ఒకసారి పోటీ చేసిన కాడ మళ్లీ చేయవు.. ఓడిపోతున్నావు... నువ్వో చిల్లర గాడివని దేశమంతా అంటున్నారు. నీ మాటలు ఎవరూ నమ్మరు.. నీ పార్టీ వాళ్లే నిన్ను ఛీ కొడుతూ తిడుతున్నారు' అని ఎర్రబెల్లి అన్నారు. రేవంత్‌రెడ్డి రూ.10కోట్లు, రూ.20కోట్లకు టిక్కెట్లు అమ్ముకున్నాడని ఆ పార్టీ వాళ్లే చెప్తున్నారని అన్నారు. ఏబీవీపీ, టీఆర్ఎస్, టీడీపీ ఇలా మారి కాంగ్రెస్‌లో చేరాడన్నారు. ఆయన కాంగ్రెస్‌లోకి వచ్చినంకనే ఆ పార్టీ నాశనమైందని కాంగ్రెస్ వాళ్లే అంటున్నారన్నారు. 'ఓటుకు నోటు కేసులో జైలుకు పోయి వచ్చినోడివి నన్ను దద్దమ్మ అనే హక్కు నీకు ఎక్కడిది?' అని ఎర్రబెల్లి ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి నా గురించి మాట్లాడితే ప్రజలు నమ్మరని, అతడి నోటిలోనే ప్రజలు ఉమ్మివేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. రాసిస్తే చదివే రాహుల్‌గాంధీకి కాళేశ్వరం ప్రాజెక్టు, సింగరేణి గురించి ఏం తెలుసని మంత్రి ప్రశ్నించారు. 60 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఇలాంటి ప్రాజెక్టులు ఎక్కడైనా కట్టారా...? కాళేశ్వరం ప్రాజెక్టు విలువ కూడా తెలియని రాహుల్‌గాంధీ రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని అనడం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరో రాసిస్తే మాట్లాడటం కాదు.. ఇక్కడ పరిస్థితులు... జరుగుతున్న అభివృద్ధిని చూసి మాట్లాడాలని మంత్రి సూచించారు.

## 'కడియం'ను గెలిపించుకుంటం

- తాటికొండ ఉప సర్పంచ్ రాములు
- స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థిని కలిసిన గ్రామస్తులు

స్టేషన్ ఘన్‌పూర్, అక్టోబర్ 19 : నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేసే స్టేషన్ ఘన్‌పూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి వెనుక దళిత సామాజికవర్గం ఉందని, ఆయన్ను గెలిపించుకోవడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నారని తాటికొండ ఉప సర్పంచ్ మారపాక రాములు అన్నారు. బుధవారం సాయంత్రం హనుమకొండలోని కడియం నివాసంలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో తాటికొండ గ్రామ దళితులు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కడియం శ్రీహరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. దళితులు, దళిత ఉప కులాలు భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు ప్రతి దళితుడు సిద్ధంగా ఉన్నారని కడియంకు రాములు తెలియజేశారు. కడియం మాట్లాడుతూ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరాలని, మూడోసారి కేసీఆర్ సారే సీఎం కావడమే లక్ష్యన్నారు. వార్డు సభ్యులు మారపాక రేణుకా ఎల్లస్వామి, ఎం.ప్రభుదాసు, రాజారపు మల్లయ్య, రాంచందర్, ఎం.జోజి, బొంకూరి యాదగిరి, ఎం.సంపత్, బాణాల సమ్మయ్య, ఎం.బాబు, రాజయ్య, ఆనంధం, అశోక్, ఆశీర్వాదం, కృష్ణ, సుధాకర్, దేవయ్య, యూత్ సభ్యులు మారపాక ప్రశాంత్, రాకేశ్, శ్రీనాథ్, సందీప్, ప్రీతం, రఘువర్మ, అజయ్ పాల్గొన్నారు.



కడియం శ్రీహరికి శుభాకాంక్షలు తెలుపుతున్న తాటికొండ గ్రామ దళితులు



సీపీకి పూల మొక్క అందజేస్తున్న సంగ్రామ్ సింగ్ జీ పాటిల్

## సీపీ అంబర్‌కిశోర్ ఝాను కలిసిన మానుకోట ఎస్పీ

సుబేదారి,అక్టోబర్ 19 : వరంగల్ పోలీసు కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అంబర్ కిశోర్ ఝాను మహబూబాబాద్ ఎస్పీ సంగ్రామ్ సింగ్‌జీ పాటిల్ మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం హనుమకొండలోని పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సీపీని కలిసి పూలమొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ఎనుమాముల మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

కాశీబుగ్గ, అక్టోబర్ 19 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు ఇస్తున్నట్లు కార్యదర్శి బరుపాటి వెంకటేశ్ రాహుల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బతుకమ్మ, దసర పండుగ పురస్కరించుకొని సెలవులు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. 21న శనివారం వారాంతపు యార్డు బందు, 22న ఆదివారం వారాంతపు సెలవు, 23న విజయదశమి, 24న పిల్ల దసర పండుగ సందర్భంగా సెలవులు ఇస్తున్నట్లు తెలిపారు. తిరిగి 25న బుధవారం నుంచి యథావిధిగా మార్కెట్‌లో క్రయవిక్రయాలు జరుగుతాయని ఆయన వివరించారు.